Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com 21 మంగళవారం జనవరి 2025 సంపుటి :2 సంచిక: 118 హైదరాబాద్ పేజీలు: 8 రూ.3/-




# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం




వాషింగ్టన్,జనవరి20(తెలంగాణ వీణ):

అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడెన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. భారత్ తరఫున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేసారు. మెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు. పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిచెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు అమలు చేతకాక నిరసనలు అడ్డుకోవడం

# సిగ్గుచేటు

హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):




రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పాలన చేతకాక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల నిరసనను అడ్డుకుంటున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పని చేయటం పార్టీల హక్కు అని తెలిపారు. తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నదని ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు.కేటీఆర్ ఏ కార్యక్రమం చేపట్టినా రేవంత్ రెడ్డికి ఎందుకు వణుకు పుడుతుందని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కండ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు పంట చేలకు నిప్పు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ రైతు దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తుంది. రేపు నల్గొండలో సభ నిర్వహిస్తామంటే ఈ రోజు పోలీసులు అనుమతి నిరాకరించారు. చేసిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతుంటే అనుమతులు నిరాకరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పోలీసుల తీరును తప్పు పడుతూ కోర్టుకు వెళ్లైనా ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు. గతంలో కూడా కుంటి సాకులు చెప్పి అనుమతులు నిరాకరిస్తే కోర్టుకు వెళ్లి మరీ శాంతియుతంగా ధర్నా చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కేటీఆర్ ఎక్కడికి వెళ్లినా శాంతియుతంగానే ప్రజలు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత అడ్డుకున్నా రేపటి దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీకి ఊరట - క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జనవరి20(తెలంగాణ వీణ):

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝూ పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝూకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.




### పెట్టుబడులు లక్ష్యంగా

# ప్రణాళికలు సిద్ధం

### దావోస్ చేసుకున్న సిఎం రేవంత్ బృందం

హైదరాబాద్, జనవరి20(తెలంగాణ వీణ):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేసుకుంది. ఆయనవెంట ఐటిశ్శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్ లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.



# సీఎం రేవంత్ మాటలు కోటలు..



- చేతలు గల్లీ కూడా దాటవు

రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి - హరీశ్‌రావు

మిగతా 2 లో

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్ అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం : మాజీ మంత్రి కేటీఆర్

మిగతా 2 లో

Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

# సంపాదకీయం

## దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు. కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరిగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది.

# సీఎం రేవంత్ మాటలు కోటలు..

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని కానీ చేతలు మాత్రం గల్లీ కూడా దాటదని, ప్రతి నెలా మొదటి తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యిచందంగా మారాయని అనేకసార్లు రుజువయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ. 2 కోట్ల 42 లక్షలు కేటాయించినప్పటికీ విడుదల చేసింది రూ. 20 లక్షలకు మించి లేదు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించబడే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించలేక పోతే ఈ ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే మహిళా కమిషన్ సభ్యుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇక నుంచి మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని హరీశ్‌రావు తెలిపారు.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఒడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

## తిరుమలలో యథావిధిగా దర్శనాలు

### ఉత్తరద్వార దర్శనాలు ముగియడంతో నిత్య కౌంకర్యాలు

**తిరుమల,జనవరి20(తెలంగాణ వీణ):**

శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి యథావిధిగా కౌంకర్యాలు, భక్తులకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ పది రోజుల్లో దాదాపు 6 లక్షల 83 వేల 304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. చివరిగా ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. ఇక సోమవారం నుంచి యథావిధిగా శ్రీవారి దర్శనాలు ప్రారంభ మయ్యాయి. తిరిగి ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి రావడంతో టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. కాగా ఆదివారం చివరి రోజు కావడంతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. కేవలం దర్శనం టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ మేరకు ముందుగానే భక్తులకు టోకెన్లు, టికెట్లను కూడా టీటీడీ అధికారులు జారీ చేశారు. గత తొమ్మిది రోజులుగా టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం టీటీడీ కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలకు సంబంధించి 50వేల టోకెన్లను టీటీడీ ముందస్తుగా జారీ చేసింది. అలాగే ఆన్‌లైన్‌లో 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా జారీ చేసింది.ఆదివారంతో శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం ముగియనుండటంతో తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈనెల 10 నుంచి 19 వరకు అంటే దాదాపు పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో భక్తులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం కల్పించింది. రోజుకు 70 వేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ అధికారుల ఏర్పాట్లు చేశారు. మరోవైపు టీటీడీ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు కూడా ఒక ఉద్యోగికి ఐదు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను జారీ చేశారు. అలిపిరి చెక్ పాయింట్ వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. భద్రతా సిబ్బంది కూడా తనిఖీలను వేగవంతం చేసి కార్లను తిరుమలకు పంపించారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న సాఫ్ట్వేర్ ఇంజనీర్ పట్టివేత

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

నగరంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.21 లక్షలు విలువైన 120 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అదనపు ఆదాయం కోసమే ఈ డ్రగ్స్ దందా చేస్తున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. హైదరాబాద్‌లోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. అదనపు ఆదాయం కోసం డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. మందస్తు సమాచారం అందుకున్న సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక ఎక్సైజ్‌పోలీసులు.. పుణె నుంచి హైదరాబాద్‌కు వాహనంలో తీసుకొస్తున్న ఎండీఎంఏ కిస్టల్ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మొదట డ్రగ్స్‌కు బానిసయ్యాడని.. వస్తున్న జీతమంతా వాటికే ఖర్చు అవుతుండడంతో డ్రగ్స్ విక్రయించడం మొదలు పెట్టినట్టు పోలీసులు తెలిపారు. క్రమంగా తోటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాడని వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీల మృతి

**తిరుపతి,జనవరి20(తెలంగాణ వీణ):**

తిరుపతి జిల్లా రేణిగుంట-కడప ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తిరుమల శ్రీవారి దర్శించుకుని హైదరాబాద్ వెళు తుండగా ప్రమాదం జరిగింది. రేణిగుంట-కడప ప్రధాన రహదారిలోని కుక్కల దొడ్డి వద్ద ప్రైవేట్ బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన సంభవించింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ అక్కడకక్కడే మృతి చెందారు. హైదరాబాద్ లోని పటాన్ చెరువుకు చెందిన సందీప్ (45) అంజలీదేవి(40)గా పోలీసులు గుర్తించారు.

## లోకేశ్‌కు డిప్యూటి సిఎం పదవి డిమాండ్

### ఈ అంశంపై ఇక మాట్లాడ వద్దంటూ టిటిపి ఆదేశం

**అమరావతి,జనవరి20(తెలంగాణ వీణ):**

ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తోన్న నేపథ్యంలో తెదేపా అధిష్ఠానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది. ఇటీవల సీఎం చంద్రబాబు మైదుకూరు పర్యటనలో ఉన్నప్పుడు కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నారా లోకేశ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆ తర్వాత పలువురు నేతలు ఇదే అంశంపై బహిరంగంగా మాట్లాడారు. పార్టీతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలను వారు చెబుతున్నారు.మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూడా నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎంను చేయాలని బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారు చెప్పడం సరికాదని పార్టీ అధిష్ఠానం భావించింది. ఇలాంటి సున్నితమైన అంశాలపై కూటమి నేతలు చర్చించి నిర్ణయం తీసుకుంటారని స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

## సాగునీటి మంత్రి ఉత్తమ్ ఇలాఖాలో నీటి ఎద్దడి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. రైతన్నకు క'న్నీటి' గోసను తెచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. పంట పొలాలకు నీళ్ల కోసం రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిని దుస్థితిని కల్పించిందని విమర్శించారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సొంత జిల్లా సూర్యాపేటలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఏంటని నిలదీశారు. యాసంగి సాగునీటి విడుదల షెడ్యూల్ పేరిట కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇచ్చారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఃఖాఖ స్టేజ్ -2 లో భాగంగా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాల్లోని 3,36,630 ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటనల్లో పేర్కొన్నారని తెలిపారు. ప్రచారం చేసుకున్నారు గానీ, రైతన్నల పంట పొలాలకు నీళ్లు మాత్రం విడుదల చేయడం లేదని విమర్శించారు. మీ ప్రభుత్వ మాటలు నమ్మి నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏం కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. నాట్ల దశలోనే సాగునీటికి గోస పడితే, మున్ముందు సాగు నీరు నీటి సరఫరా ఎలా చేస్తారని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహా మంత్రుల మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటవు అని మరోసారి రుజువైందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అద్భుతాలు చేస్తున్నట్లు భ్రమలు కల్పించడం మానేసి, ఇప్పటికైనా ఆచరణకు దిగాలని హితవుపలికారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు, ప్రతిపక్షాల మీద ఆరోపణలు చేయడం మానేసి, పంట పొలాలకు నీళ్లు అందించాలని సూచించారు. ఆందోళనలో ఉన్న రైతన్నకు దన్నుగా నిలవాలన్నారు. మరోవైపు కాళేశ్వరం జలాలతో నిండుకుండలా రంగనాయక సాగర్ ప్రాజెక్టు డ్రోన్ వీడియోను హరీశ్‌రావు ట్విట్టర్‌లో పెట్టారు. వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, రంగనాయక సాగర్‌కు గోదావరి గంగ చేరిందని అన్నారు. ఇది కాళేశ్వరం సృష్టించిన అపురూప దృశ్యం.. అద్భుత జల సౌందర్యమని పేర్కొన్నారు. కాళేశ్వరాన్ని బదనాం చేస్తున్న కబోదుల్లారా.. కన్నులు తెరిచి ఈ సుందర దృశ్యం చూడాలని మండిపడ్డారు. కాళేశ్వరం తెలంగాణకు ప్రాణధార అనే సత్యాన్ని చెరిపేయలేమని గుర్తించాలని సూచించారు.

## కక్షసాధింపు రాజకీయాలు సరికాదు

### కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకం అని మాజీఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రివైంజ్ పాలిటిక్స్‌పై జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. అయినా రివైంజ్ పాలిటిక్స్ ఏ పార్టీకి మంచిది కాదని సూచించారు. అలాంటి రాజకీయాలు చేసే వాళ్లు అధికారం పోయాక బాధ పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య.. రివైంజ్ పాలిటిక్స్ చేయలేదన్నారు. ఎవరైనా తనకు నష్టం చేసినా.. తానెవ్వరికీ నష్టం చేయను అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా? డబ్బులు తీసుకోకుండా రాజకీయం చేస్తున్నట్లుగా ఎవరైనా ఒప్పుకుంటారా..?, తనతో సహా పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయని నాయకుడెవరూ ఉండరని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

## ఎపిని అభివృద్ధి బాట పట్టిస్తున్న బాబు

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

### తదుపరి సిఎం లోకేశ్ అంటూ మంత్రి భరత్ వ్యాఖ్యలు

**జ్యూరిచ్,జనవరి20(తెలంగాణ వీణ):**

సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి బాట పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. జ్యూరిచ్‌లో పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగువాళ్లు సాధించలేనిది ఏమీ లేదన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువాళ్లు కనిపిస్తారని.. తెలుగువాళ్లు ఏ దేశంలోనైనా.. ఎక్కడైనా రాణించగలరన్నారు. ఎక్కడికి వెళ్లినా తెలుగువాళ్లను కలవాలనేదే చంద్రబాబు విధానమని.. అన్ని రంగాల్లో చంద్రబాబే తమకు స్ఫూర్తి అని వెల్లడించారు. '201924 మధ్య తెలుగు ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. భవిష్యత్ అంధకారం అనుకునే సమయంలో తెలుగు ప్రజలంతా ఐకమత్యంతో ఊహించని విధంగా ఎన్నికల ఫలితాలు చూపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీ ప్రజల్లో నమ్మకం కలిగింది. దేశం, ప్రపంచంలో ఏ ప్రముఖ కంపెనీని చూసినా తెలుగువారే కీలక భూమిక పోషిస్తున్నారు. డెన్మార్క్, బెల్జియం నుంచి నేరుగా ఏపీకి విమాన సర్వీసులు నడిచేలా కనెక్టివిటీ పెంచేందుకు ప్రణాళికలు చేస్తున్నాం' అని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి దార్శనిక నేత చేతుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉందని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సీనియర్లు, జూనియర్ల కలయికతో ఏపీ కేబినెట్ పటిష్ఠంగా ఉందన్నారు. రిలయన్స్, ఎన్టీపీసీ, టాటా లాంటి పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. ఏపీకి సీబీఎన్ అనే బ్రాండ్ ఉందని.. ఆ బ్రాండే రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని సానుకూల పరిస్థితులున్నాయని మంత్రి భరత్ అన్నారు. లోకేశ్ తమ భవిష్యత్ నేత అని, ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవన్నారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ,
లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# నాగారం మున్సిపల్ అభివృద్ధికి రూ. 3.80 కోట్ల నిధులకు కౌన్సిల్ తీర్మానం ...

**తెలంగాణవీణ , కీసర :**

నాగారం మున్సిపల్ అభివృద్ధికి తగిన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పెర్కొన్నారు . సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ. 3.80 కోట్లతో చెపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో రూ. 3.80 కోట్లతో సీసీ రోడ్లు, భూగర్భ మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు . ఐదేళ్లలో నాగారం మున్సిపాలిటీకి అన్ని రంగాల్లో అభివృద్ధికి సహకరించిన కౌన్సిలర్లకు, నాగారం, రాంపల్లీ పట్టణ ప్రజలకు చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు . సమావేశంలో వైస్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్, కమిషనర్ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




## బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన బొల్లం చంద్రమౌళి ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్..

**తెలంగాణ వీణ/నాచారం:**

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరవనీయులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నాచారం బిజెపి నాయకులు.ఈ సందర్భంగా బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ గా నియమితులైన బొల్లం చంద్రమౌళి ని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి వ్యక్తికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుంది అని వారి వారి అనుభవం, అర్హతలను బట్టి వారిని గుర్తిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఓబీసీ జిల్లా కార్యదర్శి హనమంత్ బీరదర్ డివిజన్ సీనియర్ నాయకులు యోగేశ్వర్ రెడ్డి, రాజి రెడ్డి,శ్రీధర్ రెడ్డి, నవీన్ గౌడ్,గంధమల్ల గోపి,సురేందర్,శ్రీనివాస్ యాదవ్,చారి, శేఖర్ గుప్త,లింభాజీ,వినోద్ జాదవ్ మరియు ఇతర నాయకులు పాల్గొనడం జరిగింది.



## ముంబై మూడవ ఫుల్ మారథాన్ పూర్తి చేసిన ఇంటలిజెన్స్ సీఐ కిషన్...

**తెలంగాణ వీణ/నాచారం:**




ముంబైలో ఆదివారం టాటా సంస్థ ఏర్పాటుచేసిన ఫుల్ మార్తాన్ లో ఇంటలిజెన్స్ సీఐ దుబ్బా కిషన్ పాల్గొని పూర్తి చేశారు. ముంబైలో ఫుల్ మార్తాన్ పూర్తి చేయడం ఇది మూడవసారి అని ఆయన తెలిపారు. పెంటారెడ్డి కాలనీలో నివాసం ఉంటూ తన పోలీసు విధులను సక్రమంగా నిర్వర్తిస్తూనే రన్నింగ్ కు అధిక ప్రాధాన్యత కల్పించడం చాలా విశేషం.ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. హైదరాబాదులో 4 ఫుల్ మార్తాండ్లను, కాశ్మీర్లో జరిగిన ఒక మార్తాను పూర్తి చేశానని తెలిపారు. ఇప్పటివరకు తను ఎనిమిది ఫుల్ మార్తానులను పూర్తి చేశానని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన టాటా ముంబై మారతాన్ (42.195 కిమీ )పరుగును 4 గం,, 20 నిమిషాల లో పూర్తి చేశాను. నేను పూర్తి చేసిన 8 ఫుల్ మారాథోన్ లలో ఈ రోజు పూర్తి చేసిన పరుగు బెస్ట్ టైమింగ్ అని,ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు.




# ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్ ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ట్రాన్స్పోర్ట్ బిసి వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్




**తెలంగాణ వీణ/నాచారం:**

నాచారం ఢిల్లి పబ్లిక్ స్కూల్ లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ను తెలంగాణ గవర్నర్ జీష్ణు దేవ్ వర్మ ,రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.రోడ్డు భద్రత ,ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను తెలుసుకునేలాగా ట్రాఫిక్ అవేర్నెస్ చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేశారు. తెలంగాణలో మొదటిసారి ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ పై స్టూడెంట్స్ డెమోన్ స్టేషన్ నిర్వహించారు. అనంతరం

**గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ**

రోడ్డు భద్రతపై వారి ఆలోచనలను పంచుకున్నారు,ఇది కేవలం భద్రత కాదు, 'రోడ్ బాధ్యతని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు మీద బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి.ఇలాంటి అవగాహన కార్యక్రమాలు స్కూళ్లలో చేపట్టడం చాలా ముఖ్యమని, ఒక జీవితాన్ని కూడా రక్షించగలిగితే అది స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో చేపట్టిన ఈకార్యక్రమం ద్వారా ఎంతోమందికి అవగాహన కలుగుతుందని ఆయన ప్రశంసించారు, జై జవాన్, జై కిసాన్ నినాదాలతో పాటుగా జై విజ్ఞాన్, జై అనుసంధాన్ లను కూడా కలుపుకోవాలని ఆకాంక్షించారు.

**రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ**

ట్రాఫిక్ పార్క్ ప్రతి ఒక్క పాఠశాలలలో అవసరమని,ప్రాధాన్యతను మరింత స్పష్టంచేసి, విద్యార్థులు తమ కుటుంబాల్లో ఈ అవగాహనను విస్తరించడానికి ప్రయత్నించాలని కోరారు. జాతీయగీతాలాపనలతో ఈ కార్యక్రమం



దిగ్విజయంగా ముగిసింది. అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ సురభివాణి,ఎమ్మెల్సీ పట్నం మహేందర్,తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్కా కొమురయ్య,ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత,మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీఈవో మల్కా యశస్వి రవాణా శాఖ ఉన్నాధికారులు,ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఖో -ఖో వరల్డ్ కప్ గెలిచిన క్రీడాకారులను అభినందించిన స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్

**తెలంగాణ వీణ/ఓయూ:**

ఢిల్లీలో ఈనెల 13 నుంచి 19 వరకు జరిగిన ఖో -ఖో వరల్డ్ కప్ లో నేపాల్ దేశం పై మన భారతదేశ ఖో -ఖో క్రీడాకారులు యావత్ భారతదేశం గర్వించే విధంగా బాలురు ప్రధమ బహుమతి మరియు బాలికలు ప్రధమ బహుమతి సాధించేందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులంతా పండగ వేలగా భావించి స్వీట్లు తినిపించుకోవడం జరిగింది క్రీడాకారుల కోసం కేటాభివృద్ధి కోసం ఈ స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ నిరంతరం పోరాడుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ అడ్వైజర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ సార్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్ అండ్ స్టేట్ ప్రెసిడెంట్ శాగంటి రాజేష్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సలికంటి వినోద్ హైదరాబాద్ ప్రెసిడెంట్ అన్వేష్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ లెనిన్, సురేష్, వెంకటేష్, తిరుమలు. సలీకంటి సాయి.గోపి, గణేష్ పాల్గొన్నారు.




## తార్నాకలో డ్రంక్ అండ్ డ్రైవ్ పై వాహనదారులకు అవగాహన కల్పించిన ఇన్స్ పెక్టర్ రాంబాబు

**తెలంగాణ వీణ, హైదరాబాద్....**

జాతీయ రహదారి భద్రత దృష్ట్యా, తార్నాకలో ప్రయాణికులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై నల్లకుంట ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాంబాబు, పోలీస్ అధికారుల బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్ పెక్టర్ డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఇన్స్ పెక్టర్ వివరించారు. రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.




# విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

## 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలి -త్వరలో విద్యార్థి ఉద్యమకారుల గర్జన సభ

### ఉస్మానియా యూనివర్సిటీ -తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు

**తెలంగాణ వీణ/ఓయూ:**

తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక చైర్మన్ కంచర్ల భద్రి ఆధ్వర్యంలో తార్నాకలోని ఉస్మానియా యూనివర్సిటీలో భవిష్యత్ కార్యాచరణ పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పలువురు విద్యార్థి ఉద్యమకారులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థుల ఉద్యమం మరువలేని ఘట్టం అని, స్వరాష్ట్రంలో విద్యార్థి ఉద్యమకారులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం ఉదిమకాలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. తెలంగాణ ఉద్యమకాలను గుర్తించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని, 25 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులుఇవ్వాలని , సబ్సిడీ లోన్లు ఇవ్వాలని సమావేశంలో తీర్మానం చేశారు. అదే విధంగా భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. తెలంగాణ విద్యార్థి



ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం త్వరలో ఎమ్మెల్యే, ఎంపీ లకు వినతి పత్రాలు అందజేస్తామని, అన్ని యూనివర్సిటీల్లో పర్యటించి, విద్యార్థి ఉద్యమకారుల గర్జన సభను నిర్వహిస్తామని సమావేశంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మందాల భాస్కర్, రవీందర్ నాయక్, పంతకాల శ్రీనివాస్, సునీల్ శెట్టి, పుదారి హరీష్ గౌడ్, కృష్ణలత, దర్శన్, గడ్డం శ్రీనివాస్, స్వామి గౌడ్ లావణ్య, పర్శురాజ్, ధనలక్ష్మి, ఎస్ ఎన్ ఆర్, పెంచల సతీష్, పుట్ట రంజిత్, వేదాంత మౌర్య, దర్శనం జానూ, కే రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# టిక్కెట్ల జారీ వ్యవస్థలోనున్నదళారీ సమస్యను పరిష్కరించడం ...

## ...టిక్కెట్ల అమ్మకంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో రైల్వే రక్షక దళం పాత్ర

వ్యాస రచయిత...జి.ఎం. ఈశ్వరరావు, ఐ.ఆర్.పి.ఎఫ్. ఎస్.ఇన్స్పెక్టర్ జనరల్ (ఐ.జి.) -ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ (పి.సి.ఎస్.సి.) ఆర్.పి.ఎఫ్

**హైదరాబాద్, తెలంగాణ వీణ. జనవరి 20....**

దక్షిణ రైల్వే భారతీయ రైల్వే టిక్కెట్ల వ్యవస్థలో టిక్కెట్ల అమ్మకం మరియు బ్లాక్ మార్కెటింగ్ యొక్క నిరంతర సమస్య, ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రయాణ సమయాల్లో గణనీయమైన సవాలును సూచిస్తుంది. ఈ చట్టవిరుద్ధ కార్యకలాపాలు చట్టబద్ధమైన ప్రయాణీకులకు సమానమైన టిక్కెట్ల ప్రాప్యతను దెబ్బతీయడమే కాకుండా, రైల్వే వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ప్రతిస్పందనగా, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్.పి.ఎఫ్) ఈ సమస్యను పరిష్కరించడానికి మరియు రైల్వే సేవలకు న్యాయమైన ప్రాప్యతను నిర్ధారించడానికి సమగ్రమైన మరియు బహుముఖ వ్యూహాన్ని అమలు చేసింది.

ఆర్.పి.ఎఫ్ చేపట్టిన చర్యలు... క్రమం తప్పకుండా దాడులు మరియు చర్యలు:

1.ఆర్.పి.ఎఫ్ సైబర్ సెల్లు బుకింగ్ విధానాలను నిశితంగా పరిశీలిస్తాయి, క్రమరాహిత్యాలను గుర్తించి, టికెట్ కౌంటర్లు మరియు సైబర్ కేఫను లక్ష్యంగా చేసుకుని ఖచ్చితమైన తనికీలు నిర్వహిస్తాయి. ఈ ముందస్తు చర్యల ఫలితంగా అనధికార టిక్కెట్లను జప్తు చేయడం, అనేక మంది దళారీలు అరెస్టు కావడం జరిగింది, దీని వలన వారి అక్రమ ఆదాయ వనరులకు తీవ్ర అంతరాయం కలిగింది. 2.డిజిటల్ నిఘా ఆర్.పి.ఎఫ్ అధునాతన సాంకేతిక సాధనాలను ఉపయోగించి, ఆన్లైన్ బుకింగ్ వేదికలపై నిరంతర నిఘాను నిర్వహిస్తుంది. పెద్ద సంఖ్యలో టిక్కెట్ల బుకింగ్లు మరియు అక్రమ లావాదేవీలతో సహా అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా మరియు టిక్కెట్ కౌంటర్లలో సి.సి. టి. విని అమర్చడం ద్వారా, బ్లాక్ మార్కెటింగ్ను సమర్ధవంతంగా గుర్తించి నిరోధించే సామర్థ్యాన్ని ఆర్.పి.ఎఫ్ బలోపేతం చేస్తుంది.

3.ఐ.ఆర్.సి.టి.సి తో సహకారం అనుమానాస్పద ఖాతాలను గుర్తించడానికి మరియు నిష్క్రియం చేయడానికి ఆర్.పి.ఎఫ్ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐ.ఆర్.సి.టి.సి) తో కలసి పనిచేస్తుంది. ఈ సహకార చొరవ ఏజెంట్ మరియు వ్యక్తిగత వినియోగదారు ఐ.డిల దుర్వినియోగాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తుంది, తద్వారా మరింత సురక్షితమైన మరియు పారదర్శకమైన టికెటింగ్ వ్యవస్థను నిర్ధారిస్తుంది. 4,అవగాహన ప్రచారాలు ప్రజల అవగాహన యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ, ఆర్.పి.ఎఫ్ వివిధ మీడియా వేదికలలో అవగాహన ప్రచారాలను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాలు ప్రయాణీకులకు అనధికారిక కార్యకలాపాలను నివేదించడం గురించి తెలియజేస్తాయి మరియు అధికారిక మరియు అధీకృత ఛానెల్ల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతాయి.

5.సాంకేతిక పరిజ్ఞానం సమీకృతం.

టికెటింగ్ సిండికేట్లను సమర్ధవంతంగా ట్రాక్ చేయడానికి మరియు నిర్వీర్యం చేయడానికి ఆర్.పి.ఎఫ్ తన సైబర్ సెల్లను అత్యాధునిక సాఫ్ట్వేర్ మరియు హార్డ్వేర్తోతో అమర్చింది. ఈ సాంకేతిక పురోగమనం పెరుగుతున్న అధునాతన టౌటింగ్ నెట్వర్క్ ను ఎదుర్కోవడానికి ఆర్.పి.ఎఫ్ కి అనుమతిస్తుంది.



6.చట్టపరమైన సహాయం

టికెట్ల అమ్మకంలో నిమగ్నమైన దళారులు రైల్వే చట్టం ప్రకారం జైలు శిక్షతో సహా తీవ్రమైన శిక్షలకు అర్హులు. ఇటీవలి న్యాయపరమైన తీర్పులు అనధికారిక టిక్కెట్టును తీసుకునే చర్యలను "సామాజిక నేరం"గా వర్గీకరించడం ద్వారా సమస్య యొక్క తీవ్రతను హైలైట్ చేశాయి. ఆర్.పి.ఎఫ్ ప్రయత్నాల ప్రభావం

ఆర్.పి.ఎఫ్ చేపట్టిన వ్యూహాత్మక కార్యక్రమాలు గణనీయమైన ఫలితాలను ఇచ్చాయి. అనేక హై-ప్రొఫైల్ టౌటింగ్ సిండికేట్లు విచ్ఛిన్నం చేయబడ్డాయి మరియు వేలాది మంది దళారులు పట్టుబడ్డారు. ఈ ప్రయత్నాలు పెద్ద మొత్తంలో అక్రమ టిక్కెట్లను స్వాధీనం చేసుకోవడానికి దారితీశాయి, తద్వారా పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెటింగ్ను అరికట్టి, రైల్వే వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్దరించాయి.

# మంచు మనోజ్‌కు షాక్

## మోహన్‌బాబు వల్లే బాగుపడ్డామని హాస్టల్ యజమానులు వెల్లడి



**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

మంచు మనోజ్‌కు తిరుపతి ఏ రంగంపేట హాస్టల్ యజమానులు షాక్ ఇచ్చారు. తమకు ఎలాంటి సమస్యలు లేవని.. పైగా మోహన్ బాబు విద్యాసంస్థల వల్లే తాము బాగుబడ్డామని తెలిపారు. ఈ మేరకు మంచు మనోజ్‌కు హాస్టల్ యజమానులు లేఖ రాశారు. "మనోజ్ .. మీరు మాకేదో సమస్యలు ఉన్నట్టు అవి మీకు చెప్పినట్లు మీడియాలో మాట్లాడుతున్నారు. హాస్టల్స్ విద్యార్థులకు యాజమాన్యంతో సమస్యలు లేవు.. వర్సిటీల యాజమాన్యంతోనూ విద్యార్థులకు సమస్యలు లేవు. మాకు ఏ సమస్యలు లేవు... ఒకవేళ ఉన్నా వాటిని మోహన్ బాబు, మంచు విష్ణుతో చెప్పుకుంటాం.. వారు మా సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తారు" అని అన్నారు. "మోహన్ బాబు స్థాపించిన విద్యాసంస్థల వల్లే ఈ ప్రాంతంలో భూముల అభివృద్ధి జరిగింది. పండుగ రోజు మీరు విశ్వవిద్యాలయాల గేటును తన్నటం చూసి ఆశ్చర్యపోయాం.. ఎంతో మందికి ఉద్యోగాలను ఉపాధిని అందించిన విశ్వవిద్యాలయాలవి.. మనోజ్ మీ స్వార్థం కోసం మా బ్రతుకులతో ఆడుకోకండి.. మమల్మి రోడ్డుకి లాగకండి. మీకు, మీ కుటుంబసభ్యులకు సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి. మా సమస్యలను మీకు చెప్పుకున్నట్లు మీడియాలో ప్రచారం చేయడం సరికాదు. మనోజ్ చెప్పింది పచ్చి అబద్ధం. అత్యంత దారుణం" అంటూ ఏ.రంగంపేట, సాయినాథ్ ప్రైవెట్ హాస్టల్స్ యాజమాన్యం లేఖలో పేర్కొంది. తిరుపతిలోని 39 మంది హాస్టల్స్ ప్రతినిధులు సంతకాలు చేసి లేఖ రాశారు. కాగా.. తిరుపతిలోని మోహన్ బాబు విద్యాసంస్థల్లో విద్యార్థులు సమస్యల్లో ఉన్నారని మంచు మనోజ్ ఎక్కడ మీడియాతో మాట్లాడినా పదేపదే చెబుతున్నారు. తిరుపతి చుట్టుపక్కల ఉన్న హాస్టల్ యజమానులు.. విద్యార్థులను దోచుకుంటున్నారని, పెద్ద మొత్తంలో చార్జీలను వసూలు చేస్తున్నారని, సరైన భోజనం పెట్టడం లేదని మనోజ్ చెప్పుకొచ్చారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా హాస్టల్స్ సిబ్బందితో యాజమాన్యం కుమ్మక్కై.. హాస్టల్స్ పరిస్థితిపై విద్యార్థులు చెప్పినా.. వారికే చెడు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని... హాస్టల్స్ దోపిడీని ప్రశ్నించాలని మనోజ్ చెబుతూ వస్తున్నారు. అయితే మనోజ్ చెబుతున్నవన్నీ అబద్దాలే అని లేఖలో హాస్టల్స్ యాజమాన్యం పేర్కొంది. అయితే ఈ విషయంలో ప్రభుత్వం కూడా జోక్యం చేసుకోవాల్సి పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యార్థుల సమస్యలు, హాస్టల్‌లో సౌకర్యాలు, భోజన సదుపాయాలు, ఫీజుల వివరాలపై ప్రభుత్వం విచారణ జరపాల్సిన అవసరం ఈ లేఖ ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.

# ప్రభుత్వ పథకాలపై భారాస నేతలు దుష్ప్రచారం

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపాటు

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై భారాస నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. '2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో 6,121 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి ఆత్మహత్యలకు కారణమైన గత ప్రభుత్వ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. రైతులకు డీలర్ల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం. గతంలో తూకంలోనూ లోపాలుండేవి. మూడు, నాలుగు కేజీలు అధికంగా తీసుకునేవారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికంగా తూకం వేయడానికి తావులేకుండా కఠిన నిబంధనలు అమలు చేశాం. ఇప్పుడు భారాస నేతలు ప్రతి జిల్లాకు వెళ్లి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఇది సరి కాదు. దేశవ్యాప్తంగా రైతులకు ఎప్పుడైనా మేలు జరిగిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఖీ।లజీనిబిఠ ఖీ।టటా) నాయకత్వంలో రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ముందుకెళ్తాం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ. 61 వేల కోట్లు రైతుల ప్రయోజనాల కోసం ఖర్చు చేయడమే అందుకు నిదర్శనం' అని ఆది శ్రీనివాస్ తెలిపారు.



# గవర్నర్ ప్రతిభా పురస్కారాలు -2024' ప్రకటన

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు–2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన వారిలో ..దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా, ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ ఉన్నాయి.

# యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596

**యాదగిరిగుట్ట,జనవరి20(తెలంగాణ వీణ):**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

# త్రిలింగ రామేశ్వరుని దర్శించుకున్న మాలధారులు

**నిజామాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

అతి పురాతన మహిమాన్విత శైవ క్షేత్రమైన తాండూరు త్రిలింగ రామేశ్వర స్వామి శివదీక్ష మాలధారులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది శివ స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు , అభిషేకాలు నిర్వహించారు. ఈ ఆలయం శివదీక్ష పరుల కీర్తనలతో మారు మోగింది. అనంతరం అన్న ప్రసాద వితరణను శివమాలదారులు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, శివదీక్ష స్వాములు పాల్గొన్నారు.

# భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ధర్నా

**నిజామాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

మెండోరా మండలం సోన్ పేట్ లో గ్రామభివృద్ధి కమిటీ కి చెందిన ఎకరం భూమిని ప్రభాకర్ అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొంటూ గ్రామస్తులు సోమవారం మెండోరా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. గ్రామానికి చెందాల్సిన భూమి గ్రామానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై పోలీస్ స్టేషన్ లో సంప్రదించిన ఎస్ ఐ ప్రభాకర్ కు మద్దతుగా మాట్లాడుతున్నాడని విన్నవించారు. అక్రమ రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకోని గ్రామభి వృద్ధి కమిటీ పేరా ఎకరం భూమి ని రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. తహసీల్దార్ సంతోష్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఆర్మూర్ గ్రామీణ సీఐ శ్రీధర్ రెడ్డి, ముప్కాల్ ఎస్ఐ రజనీకాంత్ లు వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ఆందోళన విరమించారు.

# కాంగ్రెస్ నేతల పల్లె నిద్ర

**నిజామాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు పోచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల గురించి గ్రామంలో కలియ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మేకల రమేష్ కళాలి అశోక్ గౌడ్ రాజు జగన్ రెడ్డి గ్రామ యూత్ అధ్యక్షుడు ఆసిఫ్ మూడ రాజు తదితరులు పాల్గొన్నారు

# భద్రాద్రి జిల్లాలో విషాద ఘటన

## బోధన చేస్తూ..గుండెపోటుతో

## టీచర్ హఠాన్మరణం

**భద్రాద్రి కొత్తగూడెం,జనవరి20(తెలంగాణ వీణ):**

ప్రస్తుతకాలంలో రోజురోజుకీ గుండెపోటు మరణాలు ఎక్కువ అవుతున్నాయి. ఆ వయస్సు..ఈ వయస్సు అనే తేడా లేకుండా..చిన్న పిల్లలు నుంచి పెద్ద వయస్సు వరకు హార్ట్ స్ట్రోక్‌తో మరణిస్తున్నారు..ఇది ఆందోళన కలిగిస్తోంది..ఉరుకుల పరుగుల జీవితం, స్ట్రెస్ ఆహారపు అలవాట్లు ఇవ్వన్నీ గుండెపోటుకు కారణం అవుతున్నాయి..అప్పటి వరకు హుషారుగా పని చేస్తూ..అందరితో కలివిడిగా గడిపిన వారు ఒక్కసారిగా కుప్పకూలి మరణిస్తున్నారు.. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో క్లాస్ రూమ్‌లో పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు పిల్లి రమేష్(44) ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మరణించాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. దీంతో విద్యార్థులు ,తోటి ఉపాధ్యాయులు.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రమేష్ ప్రతి రోజూ ఖమ్మం నుంచి ఇల్లందు ప్రభుత్వ పాఠశాలకు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం ఉపాధ్యాయుడు రమేష్ ఎప్పటి లాగానే ఇల్లందుకు చేరుకోగానే చాతిలో కొంచెం నొప్పి అనిపించడంతో.. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి గ్యాస్ సమస్యకు సంబంధించిన టా÷–లబెట్స్ తీసుకొని వేసుకున్నారు. కాస్త ఉపశమనం అనిపించగానే పాఠశాలకు వెళ్లాడు.

# మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



# జగిత్యాల ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన

## చావు బతుకుల్లో ఉన్న వ్యక్తిని పట్టించుకోని వైద్యులు

**జగిత్యాల,జనవరి20(తెలంగాణ వీణ):**

జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 200 నకిలీ నోట్ల చెలామణి

## రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ

**ముంబై,జనవరి20(తెలంగాణ వీణ):**

ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# శబరిమల అయ్యప్పస్వామి ఆలయం మూసివేత

**శబరిమల,జనవరి20(తెలంగాణ వీణ):**

కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హోమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.



# పెద్ద ప్రాజెక్టులను గద్దల్లా తన్నుకుపోతున్న కార్పోరేట్లు

## వారికి అనుకూలంగా రాష్ట్రాల్లో ప్రభుత్వ పాలసీలు

## ప్రజల బలిదానాలు, భూ దానాలు అన్నీ వృధా


**విశాఖపట్టణం,జనవరి20(తెలంగాణ వీణ):**

పెద్దపెద్ద ప్రాజెక్టులను ఎంతో ఉదాత్త ఆశయంతో, ప్రజల బలిదానా లతో, భూముల అప్పగింతతో ప్రారంభించినా..చివరకు అవి కొందరు పెట్టుబడిదారులు గద్దల్లా తన్నుకు పోతున్నారు. చిన్న పుల్లకూడా తీయని వ్యక్తులు వాటికి అధిపతులు అవుతున్నారు. తాజాగా మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను ఎపి పాలకులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఎంతో పెట్టుబడి లక్ష్యంతో ఏర్పాటు చేసిన గంగవరం పోర్టు కూడా ఆదానీ తన్నేసుకు పోయారు. పెట్టుబడిదారులు సునయాసంగా ప్రభుత్వాలను బుట్టలో వేసుకుని పెట్టిన పరిశ్రమలను తన్నుకు పోతున్నారు. దీంతో వారికి స్థాపక ఖర్చు, కష్టం లేకుండా పోతోంది. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది. ఌాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.రిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఏ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ఎ÷-లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు. క నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అ÷-జర్గ÷ంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.

# సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ

**ముంబై,జనవరి20(తెలంగాణ వీణ):**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు.



కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు

## పోలీసులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం-ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు పలువురి అరెస్టు

**నాగర్‌కర్నూల్,జనవరి20(తెలంగాణ వీణ):**

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోలీసులను ఊరిలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారు. ముళ్ల కంపలు వేసి మహిళలు, గ్రామస్తులు నిరసన తెలిపారు. పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. మైలారం గ్రామస్తులకు, రైతులకు మద్దతు తెలిపినందుకు ప్రొఫెసర్ హరగోపాల్ పలు సంఘాల నాయకు లతో కలిసి వెళ్లగా పోలీసులు వారిని అక్రమంగా అరెస్ట్ చేశారు. కాగా, మాట తప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నా ళ్లు ప్రభుత్వానికి, ప్రజలకు, ప్రతిపక్షాలకు వారధిలా ఉన్న హరగోపాల్ వంటి వ్యక్తులను అరెస్ట్ చేయడాన్ని యావత్ ప్రజానీకం ఖండించింది.

# అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

## చైతన్యపురికి చెందిన యువకుడు మృతి

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుతపులి కలకలం

## బర్రెపై దాడి.. ఆందోళన ప్రజలు

**రాజన్న సిరిసిల్ల,జనవరి20(తెలంగాణ వీణ):**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత సంచారంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తాఫానగర్ గ్రామ శివారులో రాసమల్ల రాజు అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది. అయితే పొలంలోనే పశువుల కోసం ఓ షెడ్‌ను నిర్మించాడు. అందులో బర్రెను కట్టేసి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఇక సోమవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా, బర్రె రక్తపు మడుగులో పడి ఉంది. ఆందోళనకు గురైన రాజు.. గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. ఇక అతని పొలంలో పులి పాదముద్రలను గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను అధికారులు నిర్ధారించారు. అనంతరం రైతులను, స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత కదలికలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# రికార్డు సృష్టించిన డేర్‌డెవిల్స్ టీమ్

## ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం

**న్యూఢిల్లీ,జనవరి20(తెలంగాణ వీణ):**

ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతోపాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట

## మైలారం గ్రామంలో ఆందోళనకు దిగిన స్థానికులు

## ఆందోళనకారుల అరెస్ట్‌తో గ్రామంలో ఉద్రిక్తత

**నాగర్ కర్నూల్,జనవరి20 (తెలంగాణ వీణ):**

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామంలోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గద్దం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు.ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిధిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.

# కారణం లేకుండానే కేసులో ఇరికించారు

## ఆర్జీకర్ ఆస్పత్రి కేసులో దోషి సంజయ్ వాదన

**కోల్‌కతా,జనవరి20(తెలంగాణ వీణ):**

దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్ కోర్టులో తన వాదనను వినిపించాడు. శిక్ష ఖరారు చేయడానికి ముందు తన వాదనను వినిపించుకోవడానికి జడ్జి అతడికి అవకాశం కల్పించారు. తాను ఏ నేరం చేయలేదని ఈ సందర్భంగా సంజయ్ కోర్టుకు వెల్లడించాడు .'నేను ఈ నేరం చేయలేదు. ఏ కారణం లేకుండానే నన్ను ఇందులో ఇరికించారు. నన్ను దోషిగా నిలబెట్టారు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు ధ్వంసమయ్యాయని నేను విన్నాను. నన్ను ఇరికించారో, లేదో దానిని బట్టి మీరే నిర్ణయించుకోండి. నాతో బలవంతంగా కాగితాలపై సంతకాలు చేయించారు. నేను అమాయకుడిని. నేను ఎప్పుడూ రుద్రాక్ష ధరిస్తాను. నేను నేరం చేసి ఉంటే.. అవి ఘటనాస్థలంలోనే ఊడిపోయి ఉండేవి. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మీరు ఇవన్నీ చూశారని అన్నాడు. కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌ను కోర్టు దోషీగా తేల్చింది. అయితే, సోమవారం సీల్దా కోర్టు అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ మీరు ఏదైనా చెప్పాలనుకుంటున్నారా అని ప్రశ్నించగా.. సంజయ్ రాయ్ మాట్లాడుతూ.. వారు నన్ను బలవంతంగా పత్రాలపై సంతకం చేయించారు.. నేను నిర్దోషిని అని పేర్కొన్నాడు.

ఏ కారణం లేకుండా నన్ను ఈ కేసులో ఇరికించారు అని నిందితుడు సంజయ్ రాయ్ పేర్కొన్నాడు. నేను ఎప్పుడూ రుద్రాక్ష గొలుసు ధరిస్తానని ముందే చెప్పాను.. నేను నేరం చేసి ఉంటే, అది నేరం జరిగిన ప్రదేశంలో విరిగిపోయేది.. పోలీసులు, సీబీఐ అధికారులు నన్ను మాట్లాడనివ్వలేదు.. చాలా కాగితాలపై నన్ను బలవంతంగా సంతకం చేయించుకున్నారు.. అలాగే, వాళ్లు నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కోర్టులో సంజయ్ రాయ్ చెప్పాడు. ఇక, సంజయ్ రాయ్ స్టేట్‌మెంట్‌లకు జడ్జి అనిర్బన్ దాస్ సమాధానమిస్తూ.. నాతో మాట్లాడేందుకు దాదాపు సగం రోజుల సమయం ఇచ్చాను.. మూడు గంటల పాటు నీ మాటలు విన్నాను.. నా ముందు సమర్పించిన అభియోగాలు, సాక్ష్యాలు, పత్రాలు, సాక్షులు అన్నీ పరిశీలించా.. వాటి ఆధారంగానే నిన్ను దోషిగా గుర్తించాను అని పేర్కొన్నారు. మీరు ఇప్పటికే దోషిగా నిరూపించబడ్డారని వెల్లడించారు.

## తెలంగాణలో బీర్ల సరఫరా పునరుద్ధరణ

### ప్రకటన విడుదల చేసిన యూబి సంస్థ

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుం టుందని తెలిపింది.గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో బీర్ల సరఫరాను యూబీఎల్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ సంస్థలున్నా మార్కెట్లోకి వచ్చే వాటిలో 75 శాతం వాటా యూబీఎల్‌దే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో మద్యం ధరల పెంపు అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యూబీఎల్.. సరఫరాను పునరుద్ధరించింది.

G9 TV
తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్చడం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

### నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

## మళ్లీ సత్య లాంటి మంచి సినిమాలే తీస్తా

### దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎమోషన్

**హైదరాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'సత్య' 1998లో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. మళ్లీ 27 ఏళ్ల తర్వాత ఈ మూవీ మరోసారి థియేటర్స్‌లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. వర్మ ఎమోషనల్ అవుతూ సోషల్‌మీడియాలో ఓ నోట్ షేర్ చేశారు. 'ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడంలాంటిదే. ముక్కలు ముక్కలుగా చిత్రీకరిస్తూ ఉంటాం. కాబట్టి ఫైనల్ అవుట్‌పుట్ ఎలా వస్తుందనేది తెలియదు. షూటింగ్ అయ్యాక దాన్ని చూసినవాళ్లు ఇది హిట్టనో, ఫట్టనో అంటారు. నేను మాత్రం సృష్టించిన అందాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ఎంతోమందికి ఇన్‌స్పిరేషన్‌గా నిలిచిన నా సినిమాను లక్ష్యం లేని నా ప్రయాణంలో ఓ అడుగుగా మాత్రమే భావించారు. రెండు రోజుల క్రితం వరకూ అదే అభిప్రాయంతో ఉన్నాను. నేను సత్య మూవీలోని విషాదం చూసి చలించిపోలేదు. నన్ను నేను చూసుకుని ఏడ్చాను. నన్ను నమ్మిన వారందరికీ చేసిన ద్రోహాన్ని తలుచుకుని అపరాధ భావనతో కుమిలిపోయాను. సక్సెస్, అహంకారం తలకెక్కించుకుని తాగుబోతు నయ్యాను. రంగీలా, సత్య హిట్ అవడంతో నా కళ్లు నెత్తికెక్కాయి. అప్పుడే నా విజన్‌ను కోల్పోయాను. ఎలాగో ఆ తప్పులను సరిదిద్దుకోలేను. కాబట్టి దర్శకుడిగా మొదటి స్థానంలో నిలబెట్టే సినిమాలే తీస్తాను. రెండు రోజుల క్రితం నా కన్నీళ్లు తుడుచుకుంటూ నాకు నేను ఇచ్చుకున్న మాట ఇది. 'సత్య' లాంటి సినిమా తీయలేకపోయినా.. అలాంటివి మీ ముందుకు తేవాలనే ఆలోచన కూడా క్షమించరాని నేరం. దీనర్థం నేను 'సత్య' లాంటి చిత్రాలు తీస్తానని కాదు. ఇందులో చూపించిన నిజాయితీ ఇక మీదట ప్రతి మూవీలో చూపిస్తాను. విలువైన సినిమాలే అందిస్తానని మాటిస్తున్నా' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు వర్మ కొత్త వెర్షన్ చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు.

# కవితమ్మ డాక్టర్‌కు చూపించుకుంటే మంచిది

## పసుపుబోర్డు వ్యాఖ్యలపై రఘునందన్ రావు సెటైర్లు

**సంగారెడ్డి,జనవరి20(తెలంగాణ వీణ):**

పసుపు బోర్డు తమ వల్లే వచ్చిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. కవిత మంచి డాక్టర్ కు చూపెట్టుకుని తర్వాత మాట్లాడాలని సూచించారు. జైల్లో ఉన్నప్పుడు కవిత ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయి... చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్ కి చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని రఘునందన్ రావు అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కి రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్ కి ప్రేమ పెరిగి రైతు ధర్నాలు చేస్తున్నాడని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అంబేద్కర్ కి అవమానం జరిగింది. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్ ని గౌరవించలేదు.కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమ్జ్గెన్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని రఘునందన్ రావు విమర్శించారు.




## అవినీతిమయంగా రేవంత పాలన

### బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపణ

**నిజామాబాద్,జనవరి20(తెలంగాణ వీణ):**

రేవంత్ ప్రభుత్వ పాలన పూర్తి అవినీతి మయంగా మారిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో రాజ్యాంగ సంవిధాన గౌరవ ధివస్‌పై సోమవారం వర్క్ షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు దేశానికే గర్వకారణమని చెప్పారు. పసుపు బోర్డు సాధించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 కుంభకోణాలు జరిగాయని.. వాటిని ఆధారాలతో సహా బయట పెట్టినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎఫ్.అర్.బి.ఎం పరిధిని దాటి విపరీతంగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అప్పులు చేసినప్పటికీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఎందుకు పూర్తిగా అమలు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థం కోసం పనిచేస్తే , బీజేపీ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఉత్తరాది భక్తుల కోసమే నమూనా ఆలయం

## ప్రయాగరాజ్ ఆలయంలో పూజలు చేసిన ఛైర్మన్

**తిరుమల,జనవరి20(తెలంగాణ వీణ):**

ఉత్తరాది భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా సందర్భంగా శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలియజేశారు. ప్రయాగ్ రాజ్ లోని శ్రీవారి నమూనా ఆలయాన్ని టీటీడీ ఛైర్మన్ నాయుడు దంపతులు సోమవారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు హెచ్ డీపీపీ సెక్రెటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీ ఈవో గుణ భూషణ్ రెడ్డి, స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చతుర్వేద హవనంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 13 నుండి ఫిబ్రవరి 26వ తేది సంక్రాంతి నుండి శివరాత్రి వరకు 45 రోజుల పాటు జరుగుతున్న ప్రయాగ్ రాజ్ లోని మహా కుంభ మేళాలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. 250 మంది టీటీడీ సిబ్బంది డిప్యూటేషన్ పై శ్రీవారి నమూనా ఆలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తరాదిలో ధర్మ ప్రచారం కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులకు అభినందనలు తెలిపారు. ఉత్తరాది భక్తులందరూ శ్రీవారిని నమూనా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయోధ్య శ్రీరాముడికి టీటీడీ తరపున తొలిసారిగా పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని, ఈ సందర్భంగా సరయూ నదీ తీరంలో స్వామివారికి వైభవంగా నిర్వహించిన స్నపన తిరుమంజనం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రభాకర్ రెడ్డి, బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.







తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
21 మంగళవారం జనవరి 2025

# క్రీడలు



# సరైన కమ్యూనికేషన్ లేకనే కేకేఆర్ వీడాల్సి వచ్చింది

## టీమిండియా వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్

సరైన కమ్యూనికేషన్ లేకనే కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) వీడాల్సి వచ్చిందని ఆ జట్టు మాజీ కెప్టెన్, టీమిండియా వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో శ్రేయస్ అయ్యర్ రూ. 26.75 కోట్ల రికార్డ్ ధర పలికిన విషయం తెలిసిందే. రిషభ్ పంత్(రూ. 27 కోట్లు) తర్వాత అత్యధిక మొత్తం దక్కించుకున్న ఆటగాడిగా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోటీ పడి మరీ పంజాబ్ కింగ్స్ రూ. 26.75 కోట్ల భారీ ధరకు శ్రేయస్ అయ్యర్‌ను కొనుగోలు చేసింది. తమ జట్టు సారథిగా నియమించింది. అయితే ఐపీఎల్ 2024 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే కేకేఆర్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. కానీ రిటెన్షన్ ప్రక్రియలో కేకేఆర్ అయ్యర్‌ను పక్కనపెట్టింది. దాంతో ఆ జట్టును వీడిన శ్రేయస్ అయ్యర్ వేలంలో భారీ ధరను సొంతం చేసుకున్నాడు. సాధారణంగా టైటిల్ అందించిన సారథిని ఎవరూ వదులుకోరు. కానీ కేకేఆర్ వదిలేయడంపై తాజాగా శ్రేయస్ అయ్యర్ స్పందించాడు. 'కేకేఆర్ తరఫున ఐపీఎల్ టైటిల్ గెలవడం సంతోషంగా అనిపించింది. కేకేఆర్‌కు విపరీతమైన ఫ్యాన్స్ మద్దతు ఉంటుంది. ప్రతీ మ్యాచ్‌కు స్టేడియం మొత్తం ప్రేక్షకులతో నిండిపోయేది. ఆ జట్టులో గడిపిన ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాను. ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత కేకేఆర్ మేనేజ్‌మెంట్‌తో చాలా సార్లు మాట్లాడాను. కానీ, ఎప్పుడూ రిటెన్షన్ గురించి చర్చించలేదు. చివరి వరకు కేకేఆర్ సరైన సమాచారం ఇవ్వలేదు. దాంతో కాస్త గందరగోళానికి గురయ్యాను. సరైన కమ్యూనికేషన్ లేకపోవడంతోనే జట్టును వీడాల్సి వచ్చింది. అయితే పరస్పర అంగీకరంతోనే ఇది జరిగిందని బలంగా నమ్ముతాను. రిటెన్షన్‌కు వారం ముందే జట్టు ప్రణాళికలు తెలిసాయి. దాంతో నేను నా నిర్ణయం తీసుకున్నా. ఆ తర్వాత ఏం జరిగినా ఫర్వాలేదని ముందుకు సాగాను. మెగా వేలం జరుగుతున్నప్పుడు నేను హైదరాబాద్‌లోనే ఉన్నాను. దేశవాళీ మ్యాచ్ కోసం అక్కడికి వెళ్లాను. మంచి ధర పలుకుతానని అనుకున్నా. కానీ ఇంత భారీ మొత్తంలో వస్తుందని అస్సలు ఊహించలేదు. వేలంలో రెండు జట్లు నా కోసం తీవ్రంగా పోటీపడ్డాయి. అది నాకెంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది. కాసేపటికి రూమ్ డోర్ మూసేసి.. బాత్రూమ్‌కు వెళ్లిపోయా. బయట ఏం మాట్లాడుకుంటున్నారనేది వినకూడదనే అలా చేశాను.'అని అయ్యర్ చెప్పుకొచ్చాడు.



# బుమ్రా తెరవెనుక వచ్చి ఆడాలనుకుంటున్నారు

## బ్రిటిష్ రాక్ బ్యాండ్ ప్రధాన గాయకుడు క్రిస్ మార్టిన్ జస్ప్రీత్ బుమ్రాపై ఆసక్తికర వ్యాఖ్యలు

ముంబైలో కోల్డ్‌ప్లే మ్యూజిక్ బ్యాండ్ నిర్వహించిన కన్సర్ట్ భారత క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా నిలిచింది. బ్రిటిష్ రాక్ బ్యాండ్ ప్రధాన గాయకుడు క్రిస్ మార్టిన్, ప్రదర్శన సమయంలో భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గురించి ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "స్కై ఫుల్ ఆఫ్ స్టార్స్" పాట సమయంలో క్రిస్ మార్టిన్ అకస్మాత్తుగా జస్ప్రీత్ బుమ్రా పేరును ప్రస్తావిస్తూ, "మేము ప్రదర్శనను ముగించాలి, ఎందుకంటే బుమ్రా తెరవెనుక వచ్చి ఆడాలనుకుంటున్నారు," అని జోక్ చేశారు. అతను మరింతగా మాట్లాడుతూ, "అతను ఇప్పుడు నాకు బుమ్రా బౌలింగ్ చేయాలి," అని చమత్కరించి ప్రేక్షకులను మురిపించాడు. ఈ వ్యాఖ్యలతో ప్రేక్షకులు ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. ఇదే కాకుండా క్రిస్ మార్టిన్ తన హిందీ వ్యాఖ్యలతో ఆకట్టుకున్నాడు, "శుక్రియా" అంటూ ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశాడు. ఒక ప్లకార్డు నుండి "జై శ్రీ రామ్" అని చదవడం ద్వారా మార్టిన్ అభిమానులను మరింత ఉత్సాహపరిచాడు. కోల్డ్‌ప్లే భారత పర్యటన జనవరి 18న ముంబైలో ప్రారంభమైంది. ముంబైలో మూడు రోజులు ప్రదర్శనలు ఇచ్చిన తర్వాత, బ్యాండ్ జనవరి 25, 26 తేదీల్లో అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియంలో ప్రదర్శనలు ఇవ్వనుంది. జనవరి 26న డిస్నీ హాట్‌స్టార్ ద్వారా ఈ కన్సర్ట్ ప్రత్యక్ష ప్రసారం చేయ బడుతుంది. కోల్డ్‌ప్లే ప్రదర్శనల్లో జస్ప్రీత్ బుమ్రా పేరు ప్రస్తావన పలు ఆసక్తికర వ్యాఖ్యలకు దారితీసింది. క్రిస్ మార్టిన్ మాట్లాడుతూ, "బుమ్రా ప్రపంచంలో నంబర్ 1 బౌలర్. అతని కోసం ప్రేమతో, ప్రపంచానికి అతని గొప్పతనాన్ని చూపాలని మేము అనుకుంటున్నాము," అని పేర్కొన్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బుమ్రా తీసిన వికెట్ల క్లిప్‌ను స్క్రీన్‌పై ప్రదర్శించి, అతనిపై ఉన్న అభిమానాన్ని వ్యక్తపరిచారు. జస్ప్రీత్ బుమ్రా భారత క్రికెట్ జట్టు ప్రముఖ ఫాస్ట్ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. అతని ప్రత్యేకమైన బౌలింగ్ శైలి, వేగం, యార్కర్‌లు, ఒత్తిడిలో చక్కటి ప్రదర్శనల ద్వారా ప్రపంచ క్రికెట్‌లో ప్రాధాన్యత పొందాడు. జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లోనే కాకుండా ప్రపంచ క్రికెట్‌లో కూడా నెంబర్ 1 ఫాస్ట్ బౌలర్‌గా పేరుపొందాడు. అతని పట్టుదల, శ్రమ, ప్రతిభ భారత జట్టును గెలుపుల బాటలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జస్ప్రీత్ బుమ్రా, తన పేస్ అటాక్‌తో, ఇంకా ఎన్నో విజయాలను సాధించడానికి, భారత క్రికెట్‌ను ప్రపంచంలో మరింత పైస్థాయికి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు. ముంబై కోల్డ్‌ప్లే ఈవెంట్ భారత సంగీత, క్రికెట్ అభిమానులకు ఒక ప్రత్యేక అనుభూతి అందించింది. క్రిస్ మార్టిన్ చేసిన చమత్కార వ్యాఖ్యలు, వారి ఐకానిక్ పాటలు, కచేరీని మరింత ప్రత్యేకంగా మార్చాయి. కోల్డ్‌ప్లే మళ్లీ భారతదేశంలో ప్రదర్శన ఇస్తూ, అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.



# రిషభ్ పంత్‌పై సంజీవ్ గోయెంకా ప్రశంసల జల్లు

టీమిండియా వికెట్ కీపర్, లక్నో సూపర్ జెయింట్స్ నయా కెప్టెన్ రిషభ్ పంత్‌పై ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా ప్రశంసల జల్లు కురిపించాడు. ఐపీఎల్ చరిత్రలోనే రిషభ్ పంత్ అత్యుత్తమ కెప్టెన్‌గా నిలుస్తాడని ఆకాంక్షించాడు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ వ్యవహరిస్తాడని సంజీవ్ గోయెంకా అధికారికంగా ప్రకటించాడు. కోల్‌కతా వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో సంజీవ్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ కార్యక్రమంలో పంత్ కూడా పాల్గొన్నాడు. గత సీజన్ వరకు ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా వ్యవహరించిన రిషభ్ పంత్.. మెగా వేలానికి ముందు ఆ జట్టును వీడాడు. గతేడాది నవంబర్‌లో జరిగిన మెగా వేలంలో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్ల ఆల్ టైమ్ రికార్డ్ ధరకు కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆర్‌టీఎమ్ కార్డ్ ఉపయోగించడంతో లక్నో భారీ ధరకు బిడ్ వేసి దక్కించుకుంది. అందరూ ఊహించినట్లుగానే అతనికే సారథ్య బాధ్యతలు అప్పగించింది. దాంతో లక్నో సూపర్ జెయింట్స్ సారథిగా ఎంపికైన నాలుగో ఆటగాడిగా రిషభ్ పంత్ నిలిచాడు. అతని కన్నా ముందు కేఎల్ రాహుల్, కృనాల్ పాండ్యా, నికోలస్ పూరన్ ఆ జట్టును నడిపించారు. గత సీజన్ వరకు రాహుల్ లక్నోను నడిపించాడు. అతని గైర్హాజరీలో కృనాల్ పాండ్యా, నికోలస్ పూరన్‌లు సారథ్య బాధ్యతలు చేపట్టారు.అయితే గత సీజన్ సందర్భంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంతో తీవ్ర అసహనానికి గురైన సంజీవ్ గోయెంకా.. మైదానంలోనే అందరు చూస్తుండగానే రాహుల్‌పై గట్టిగా అరిచాడు. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు చెలరేగాయి. ఆ తర్వాత గోయెంకా దిద్దుబాటు చర్యలు చేపట్టినా.. ఆ జట్టులో కొనసాగేందుకు కేఎల్ రాహుల్ ఆసక్తి చూపలేదు. దాంతో ఆ జట్టు భారీ ధరను వెచ్చించి రిషభ్ పంత్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మూడు సీజన్లలో పంత్ సారథిగా వ్యవహరించాడు. ఐపీఎల్ 2021లో ఢిల్లీ టేబుల్ టాపర్‌గా నిలిచింది. కానీ ఫైనల్ చేరలేకపోయింది. ఐపీఎల్ 2022, ఐపీఎల్ 2024 సీజన్‌లో మాత్రం దారుణంగా విఫలమైంది. రోడ్డు ప్రమాదంతో పంత్ ఐపీఎల్ 2023 సీజన్ ఆడలేదు. 2016లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన పంత్... అప్పటి నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ఆడాడు. 110 మ్యాచులు ఆడి 35.31 సగటుతో 3,284 రన్స్ సాధించాడు. అందులో ఓ శతకం, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



# రోహిత్ శర్మపై నెటిజన్ల ప్రశంసలు



ముంబయి వాంఖడే స్టేడియం 50 సంవత్సరాల సెలబ్రేషన్స్? గ్రాండ్?గా జరిగాయి. ఈ ఈవెంట్?కు క్రికెట్ దిగ్గజాలు దిగ్గజాలు సునీల్ గావస్కర్, సచిన్ తెందూల్కర్, రవిశాస్త్రి, డయానా ఎడుల్జీ తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే టీమ్ఇండియా ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా కార్యక్రమానికి హాజరయ్యాడు. ఈ క్రమంలో సీనియర్ క్రికెటర్ రవిశాస్త్రి పట్ల రోహిత్ వ్యవహరించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంది. దీంతో సోషల్ మీడియాలో అతడిపై ప్రశంసలు కురుస్తున్నాయి. మరి రోహిత్ ఏం చేశాడంటే? వాంఖడే స్టేడియం 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారం రోజుల నుంచి ముంబయిలో మైదానం వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆ సంబరాలు ముగింపునకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ముంబయి క్రికెట్ అసోసియేషన్ ఓ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ సభా వేదికపై మాజీ క్రికెటర్లు ఆశీనులయ్యారు. వారి కోసం స్టేజ్‌పై కాస్త గ్యాప్ ఇస్తూ, కుర్చీలను మూడువైపులా వేశారు. అయితే రోహిత్ శర్మ స్టేజ్ మీదకు చేరుకునేటప్పటికే, గావస్కర్, సచిన్, ఎడుల్జీ కుడి వైపున కూర్చొని ఉన్నారు. రవిశాస్త్రి ఒక్కడే ఎడమ వైపున కూర్చొని ఉన్నాడు. ఈ మధ్యలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇక రవిశాస్త్రి తన పక్కన ఉన్న సీటును చూపిస్తూ అందులోకి రావాలని రోహిత్?కు సూచించాడు. అయితే రోహిత్ ఆ కార్నర్?లో కాకుండా మధ్యలో ఖాళీగా ఉన్న కుర్చీపై కూర్చోవాలని రవిశాస్త్రిని కోరాడు. అలా మాజీ క్రికెటర్‌ను దిగ్గజాల మధ్యలో కూర్చోబెట్టి శాస్త్రి పక్కనే రోహిత్ ఆశీనులయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. దీంతో 'రోహిత్, నువ్వు సూపర్', 'ఇందుకే కదా నువ్వంటే మాకు ఇష్టం', 'మానవత్వం కలిగిన గొప్ప ఆటగాడు' అంటూ హిట్?మ్యాన్?పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ఫిబ్రవరిలో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ గురించి రోహిత్ ఈ ఈవెంట్?లో మాట్లాడాడు. 140 కోట్ల మంది ఆశలను దుబాయ్ తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. మళ్లీ కప్పుతో తిరిగొచ్చి, ఇదే మైదానంలో సంబరాలు చేసుకుందమని తెలిపాడు. 'దుబాయ్‌లో జట్టు వెనక 140 కోట్ల మంది మద్దతు ఉంటుంది. మావంతు తీవ్రంగా శ్రమించి విజేతగా నిలిచేందుకు ప్రయత్నిస్తాం. మళ్లీ వాంఖడేకు ఛాంపియన్స్ ట్రోఫీని తీసుకొస్తాం' అని రోహిత్ పేర్కొన్నాడు.

# శివుడి పాత్రలో అక్షయ్‌కుమార్

## ఆకట్టుకుంటున్న కన్నప్ప లుక్

ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పరమేశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది. ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు అంటూ అక్షయ్ శివుడి రూపంలో ఉన్న అక్షయ్ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది.




# మీనాక్షికి ఫస్ట్ క్రష్ అతడే

సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్టు అందుకొని వరుస హిట్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి. అయితే తను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచినప్పటి నుండి ఎవరో ఒక హీరోతో డేటింగ్ లో ఉందని, ఇంకో హీరోతో పెళ్లి అని ఎదో ఒక పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకీ మీనాక్షి లైఫ్ లో లవ్ ఉందా? ఆమెకు ఎవరంటే ఇష్టం? వీటిపై ఆమె ఏమన్నారు అంటే.. తనపై వస్తున్న రూమర్స్ ని ఖండిస్తూనే మీనాక్షి తన లవ్ లైఫ్ గురించి చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. " ప్రస్తుతం అయితే నా ఫోకస్ అంత సినిమాలపైనే ఉంది. స్కూల్ లేదా కాలేజీలో స్టూడెంట్స్ కు కచ్చితంగా టీచర్లపై క్రష్ ఉంటుంది. నాక్కూడా అలాంటిదే ఉంది. నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు నా క్లాస్ లో ఓ టీచర్ అంటే చాలా ఇష్టం. టోటల్ క్లాస్ మొత్తం అతడ్ని ఇష్టపడేది. నాకైతే ఇంకా ఎక్కువ ఇష్టం. అదే నా ఫస్ట్ క్రష్ అండ్ లవ్." అంటూ తన ఫస్ట్ క్రష్ ని రివీల్ చేసింది. మాటలు కొనసాగిస్తూ.. " నాకు ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడేంత టైమ్ దొరకలేదు. మరీ ముఖ్యంగా మెడిసిన్ చదువు వల్ల ప్రేమకు పూర్తిగా దూరమయ్యాను. కాలేజీ లైఫ్ లో ఎలాంటి లవ్ లేదు. చదువుతోనే సరిపోయింది. పైగా మెడికల్ కాలేజీ కదా ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ చదువే. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత కూడా నేను ఎవరి ప్రేమలో పడలేదు. కెరీర్ పై మాత్రమే ఫోకస్ పెడుతూ వస్తున్నాను. ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నకాబట్టి ప్రేమ, పెళ్ళికి టైమ్ ఉంది. ప్రస్తుతానికి సినిమాలే నా లోకం" అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది.




# ఎమర్జెన్సీని అడ్డుకున్న ఖలిస్తానీ రాడికల్స్ బృందం



కంగనా రనౌత్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ. అనేక వివాదాల అనంతరం ఎట్టకేలకు జనవరి 17న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అయ్యింది. అయితే రిలీజ్ అనంతరం ఈ సినిమా అనేక అవాంతరాలను ఎదురుకుంటుంది. ఇప్పటికే బాంగ్లాదేశ్ లో ఈ సినిమాని బ్యాన్ చేయగా, ఇంగ్లాండ్ రాజధాని లండన్ లో గందరగోళం ఏర్పడింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. మాజీ భారత ప్రధాని ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఏర్పడిన చీకటి రోజులు ఎమర్జెన్సీ కాలాన్ని బేస్డ్ చేసుకొని ఈ సినిమా తెరకెక్కిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా స్పెషల్ ప్రాపగాండాతో తెరకెక్కించారని పలు చోట్ల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సిక్కుల్లో వ్యతిరేఖత ఎక్కువగా ఉంది. ఇదంతా పక్కనా పెడితే.. తాజాగా 'ఎమర్జెన్సీ' సినిమా ప్రదర్శన మధ్య, ఖలిస్తానీ రాడికల్స్ బృందం లండన్‌లోని సినిమా హాల్‌లోకి చొరబడి థియేటర్ లోపల గందరగోళం సృష్టిస్తూ సినిమా ప్రదర్శనను అడ్డుకుంది. నివేదిక ప్రకారం, ముసుగు ధరించిన రాడికల్స్ బృందం థియేటర్‌లో గందరగోళం కలిగించడం ద్వారా స్క్రీనింగ్‌కు అంతరాయం కలిగించింది. ఈ సంఘటనకు సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో ఖలిస్తానీ అనుకూల తీవ్రవాదుల బృందం నినాదాలు చేస్తూ సినిమా ప్రదర్శనకు అంతరాయం కలిగించడం చూడవచ్చు. సాక్షుల వెల్లడించిన వివరాల ప్రకారం.. రాడికల్స్ సున్నితమైన రాజకీయ సంఘటనలను ప్రస్తావించే ఎమర్జెన్సీ చిత్రాన్ని ప్రదర్శించకుండా నిరోధించే ప్రయత్నం చేశారని తెలుస్తోంది. సినిమా స్క్రీనింగ్ సమయంలో రాడికల్స్ సినిమా హాల్‌లోకి ప్రవేశించి, ఒక గందరగోళం సృష్టించి, షోని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఎవరిని అరెస్ట్ చేసినట్లు తెలియలేదు. పోలీసులు విచారం చేపట్టినట్లు తెలిపారు.

# ఖోఖో టీంకు శుభాకాంక్షలు తెలిపిన రాజమౌళి, మహేష్‌బాబు

తొలి ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ సత్తా చాటిన విషయం తెలిసిందే. దేశరాజధాని ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన ఈ వరల్డ్ కప్ మొదటి ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు టైటిల్స్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించాయి. అచ్చొచ్చిన స్వదేశీ క్రీడలో టోర్నీ ఆరంభం నుంచీ అసలు ఓటమన్నదే ఎరుగకుండా సత్తాచాటిన మన క్రీడాకారులు.. ఫైనల్‌లోనూ అదే ఆటతీరుతో తమకు ఎదురేలేదని నిరూపించారు. ఇరు విభాగాల్లోనూ నేపాల్ ప్రత్యర్థి కాగా రెండింట్లోనూ ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. అయితే భారత్‌ను విశ్వవిజేతగా నిలిపినందుకు పురుషుల, మహిళల జట్లకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా టాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళితో పాటు మహేశ్ బాబు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. భారతదేశపు ప్రాచీన క్రీడలలో ఒకటైన ఖో ఖో ప్రపంచ కప్‌ను ఈ సంవత్సరం ప్రారంభంలో భారత ఇరు జట్లు గెలుచుకోవడం సంతోషంగా ఉంది. అద్భుతమైన ప్రదర్శనలతో తొలి టైటిల్స్ గెలిచి దేశం గర్వించేలా చేసినందుకు భారత మహిళల, పురుషుల జట్లకు అభినందనలు అంటూ రాజమౌళి రాసుకోచ్చాడు.

# భారీ అంచనాలు పెంచుతున్న తండేల్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written